
కథ

# పిచ్చుక గూడు

విన్నకోట సుశీలాదేవి



**'టక్ ... టక్... టక్'**
**శబ్దానికి కళ్లు విప్పింది మాధవి.**
**చుట్టూ చూసింది!**
**ఏం కనబడలేదు!**

మళ్లీ కళ్లు మూసుకోబోతుండగా.... 'టక్... టక్... టక్' అంటూ చప్పుడు వినిపించింది!

కళ్లు తెరిచి శబ్దం వచ్చిన వైపు చూసింది. ఒక మూలగా గోడకు తగిలించిన పెద్ద అద్దం మీద రెండు పిచ్చుకలు వాలి ముక్కుతో అద్దాన్ని పొడుస్తున్నాయి.

చిన్న పిచ్చుకలు... లేత గోధుమ తెలుపు రంగు కలిసిన రంగుల్లో చూడముచ్చటగా ఉన్నాయి. ఆ అద్దంలో తమ ప్రతిబింబాల్ని చూసుకుంటూ ముక్కుతో పొడుస్తున్నాయి. ఒకసారి అద్దంలో చూసుకోవడం... తర్వాత ఒకదాని ముఖంలోకి ఒకటి చూసుకోవడం, మళ్లీ అద్దాన్ని పొడవడం...

మాధవి వాటివైపు ఉత్సాహంగా చూసింది. ఎంత బాగున్నాయి? అయినా ఇవెక్కడనుండి వచ్చాయబ్బా అనుకుంటుండగా అద్దం ప్రక్కన ఉన్న చెక్కబీరువా మీద గడ్డి, చిన్న పుల్లలతో ఒక గూడు కనబడింది.

ఓ! ఇవక్కడ గూడు పెట్టాయన్నమాట! ఎంత కాలమైందో ఇవి గూడుకట్టి తనెప్పుడూ చూడలేదే! అయినా తనిల్లు దులిపి చాలా కాలమైంది. పది రోజులనుండీ జ్వరంతో మంచంలో పడి వుంది. ఈ మధ్య ఇంటా బయటా పని బాగా ఎక్కువైంది. శరీరానికి విశ్రాంతి లేకపోవడంతో అలిసిపోయింది. ఆఫీసులో ఇన్‌స్పెక్షన్ ఉండడంతో ప్రొద్దున్నే హడావుడిగా తయారయి ఆఫీసుకెడితే తిరిగి రావడం ఏ రాత్రికో! ఎలాగో ఓపిక తెచ్చుకుని వంటచేసి పిల్లలకీ ... భర్తకీ పెట్టి తను అన్నం తింటుండగానే నిద్ర ముంచుకు వచ్చేది. మళ్లీ తెల్లారు ఝామున నాలుగింటికి లేస్తేగాని పనయ్యేది కాదు. తీరికలేని ఈ పనితో ఇంటి విషయమే పట్టించుకోలేదు. అదీకాక ఆ చెక్కబీరువాలో పనికిరాని వస్తువులు దాచింది ఎంతో భద్రంగా. అందుకే ఆ బీరువా తీసే అవసరం ఎవరికీ లేకపోయింది. ఎవరూ అక్కడకు రావడం లేదని తెలుసుకునే ఆ పిచ్చుకలు దానిమీద గూడుపెట్టి ఉంటాయి. రోజూ అవి గదిలో తిరుగుతున్నా తను జ్వరతీవ్రతలో గమనించలేదు. ఇవ్వాళే తనకు కాస్త నెమ్మదించింది.

పిచ్చుకలు అద్దం మీద నుండి... గూడులోకి వెళ్లాయి. గూడులో పిల్లలున్నాయేమో కిచ కిచమన్నాయి.

ఆ ధ్వని మాధవి చెవులకు మధురసంగీతంలా వినవచ్చింది. ఆ మధురసంగీతం ఆమెలోని పాత జ్ఞాపకాలను తవ్విపోశాయి. చిన్నప్పుడు దోసపాడులో నున్న తాతగారింటికి తను వెళ్లడం గుర్తొచ్చింది. ఆ ఇంటి వసారాలో పావురాలు గూళ్లు పెట్టడానికి అనువుగా కమ్మీలు ఏర్పాటు చేశారు. వాటి మీద ఎన్నో పావురాలు గూళ్లు పెట్టేవి. మధ్య మండువా

చుట్టూ పిచ్చుకల గూళ్లుండేవి. ఆ పిచ్చుకల కిచకిచ శబ్దాలతో ఇల్లు మారుమ్రోగుతుండేది. మొదటిసారి ఆ ఇంటిని చూసినప్పుడు ఆశ్చర్యానందాలతో ఉక్కిరిబిక్కిరయిపోయింది. అప్పుడు తను ఆరోక్లాసు చదువుతోంది. ఇక అప్పటినుండి శెలవులిచ్చినప్పుడల్లా తాతగారి ఊర్లోకెళ్లి ఆ పక్షులతో ఆడుకోవడమే తనకిష్టంగా ఉండేది.

ఒకసారి ఉగాది పండక్కి పనివాడు పైన బూజులు దులుపుతూంటే పొరపాటున కర్ర పిచ్చుకపిల్లలు క్రిందపడి చచ్చిపోయాయి. గుడ్లు చితికిపోయాయి. ఆ సాయంత్రం గూటికి తిరిగి వచ్చిన పిచ్చుకలు చచ్చిపోయిన తన పిల్లల్ని చూసుకొని అవి చేసిన గొడవకు అందరూ ఎంతో దు:ఖించారు.

తాతగారు అంత అజాగ్రత్తగా బూజు దులిపినందుకు వెంటనే ఆ పనివాడిని పన్లోంచి తీసేశారు.

'పక్షుల్లో మమతానురాగాలు చాలా ఎక్కువ. ఒక కాకిపోతే వంద కాకులు వస్తాయి. ఈ పిచ్చుకల్ని చూశారా. తమ పిల్లలకోసం ఎలా ఏడుస్తున్నాయో? అటువంటి పక్షులకు కష్టం కలిగిస్తే మన జీవితం కూడా అలాగే కష్టాలపాలవుతుంది. గుర్తుంచుకోండి' అన్నారు తాతగారు పిల్లల్ని ఉద్దేశిస్తూ.

ఆ పిచ్చుకలు ఏడ్చి... ఏడ్చి... చివరకు ఇంట్లో నుండి వెళ్లిపోయినా ఆ తర్వాత మిగిలిన గూళ్లను అందరూ ఎంతో జాగ్రత్తగా చూసుకునేవారు.

తర్వాత తన పెళ్లయింది. దోసపాడు నుండి దేశ రాజధానికి వచ్చేసింది. ఈ కాంక్రీటు అరణ్యంలో పక్షులని కాదు కదా... పచ్చని చెట్లని కూడా అరుదుగా చూసింది! అంతా అపార్టుమెంట్ల సంస్కృతి.

'ఛీ! ఛీ! వెధవ పిచ్చుకలు ఎక్కడనుండొచ్చాయి?' విసుక్కుంటూ వచ్చాడు శ్రీనివాస్.


మాధవి ఆలోచన్ల నుండి బయటపడింది. భర్త శ్రీనివాస్ పిచ్చుకలని బయటకి తరిమేశాడు.

'అదేమిటండీ! అలా వెళ్లగొట్టేశారు! ఎంత ముచ్చటగా ఉన్నాయవి?' అంది నొచ్చుకుంటూ. 'ముచ్చటా! పాడా? ఇల్లంతా పాడు చేస్తున్నాయి. ఈ అద్దం మీద ఎలా రెట్టలు వేశాయో చూడు. ఇవెక్కడో గూడుపెట్టి ఉంటాయి. రేపు పనమ్మాయి వచ్చాక వెతికించి బయట పారేయించాలి.' అన్నాడు.

ఆ మాటలు విని మాధవి కంగారుపడింది. 'ఇంకానయం. ఆ పని మాత్రం చెయ్యకండి. ఇన్నాళ్లు మనింట్లోకి ఒక ప్రాణి వచ్చి గూడుపెట్టిందంటే ఎంత అదృష్టం. ఈ కాంక్రీటు జంగిల్లోకి ఇదెక్కడి నుండి వలస వచ్చిందో! ఈ జనరాక్షసులు దీన్నెలా బ్రతకనిచ్చారో ఆశ్చర్యంగా వుందండీ వీటిని చూస్తుంటే ప్రాణం లేచొచ్చినట్లుగా వుంది. మీరు వీటిని ముట్టుకోవడానికి వీల్లేదు. వాటి బ్రతుకు వాటిని బ్రతకనివ్వండి. ఈ ప్రపంచంలో మనిషికొక్కడికే జీవించే హక్కు వుందా! ఇంకే ప్రాణి బ్రతక్కూడదా?' పెద్దగా అరవసాగింది. ముఖం ఎర్రబడింది. అసలే నీరసంగా వుండడంతో దగ్గుతెరతో వుక్కిరిబిక్కిరవసాగింది.

మాధవికి అంత ఆవేశం ఎందుక్కలిగిందో అర్థంకాక తెల్లబోయాడు శ్రీనివాస్. చటుక్కున లోపలికెళ్లి గ్లాసుతో మంచినీళ్లు తెచ్చి ఆమె చేత త్రాగించాడు.

తల్లి అరుపులకు టి.వి. చూస్తున్న కొడుకులిద్దరూ పరుగెత్తుకు వచ్చారు.



'మాధవి, ఇప్పుడేం జరిగిందని అంత ఆవేశపడ్డావ్? నీకెలా ఇష్టమైతే అలాగే కానీ!' ప్రక్కన కూర్చుని మెల్లగా వీపురాయసాగాడు.

'ఏమిటి డాడీ! అమ్మ ఎందుకలా అరిచింది!' అనడిగాడు పెద్దకొడుకు.

'మరేం లేదురా! ఎక్కడినుంచో రెండు పిచ్చుకలొచ్చి మనింట్లో గూడుపెట్టాయి. వాటిని చూసి మీ అమ్మ మురిసిపోతోంది." అన్నాడు.

వాళ్లిద్దరూ ఆశ్చర్యంగా చూశారు.

'పిచ్చుకలా! అంటే ఏమిటి? అవెలా వుంటాయి! ఎక్కడ పెట్టాయి గూడు?' అంటూ గదంతా చూడసాగారు.

'ఆ బీరువా మీద పెట్టిందిరా. మీరటు వెళ్లకండి. ఆ గూట్లో పిచ్చుక పిల్లలుంటాయి. మీరు బీరువా ఏ మాత్రం కదిలించినా ఆ గూడు క్రిందపడిపోతుంది. అవి చచ్చిపోతాయి. ముందు మీరీ గదిలోనుండి వెళ్లండి!' మాధవి కంగారుగా మంచంమీద నుండి లేవబోయింది.

'మాధవీ! నీకసలే ఒంట్లో బాగాలేదు. లేవకు. పిల్లలు వాటినేమీ చెయ్యరులే!' అంటూ శ్రీనివాస్ మాధవిని పట్టుకున్నాడు.

పిల్లలవైపు తిరిగి 'ఒరేయ్! మీరు పోయి హోమ్ వర్క్ చేసుకోండి!' అంటూ కసిరాడు.

వాళ్లు అయిష్టంగానే కదిలారు. 'మాధవీ! నువ్వు ప్రశాంతంగా ఉండు. నీ పిచ్చుకలకి ఏం జరగదు!' అన్నాడు.

మాధ స్థిమితపడింది. 'ఇవాళ్ల జ్వరం తగ్గినట్లుందే! ఒళ్లు చల్లగా ఉంది. బహుశా ఈ పిచ్చుకలు నీ రోగాన్ని పోగొట్టాయేమో!' అన్నాడు.

మాధవి నవ్వుతూ 'అవునండీ. ఉదయం నుండీ నాకివే కాలక్షేపం అయ్యాయి. వీటిని చూస్తోంటే ఒక్కసారి నా చిన్నతనంలోకి మా తాతగారి మండువా ఇంట్లోకి వెళ్లబోయినట్లుగా ఉంది!' అంది.

శ్రీనివాస్ నవ్వి 'బహుశా ఇవి మీ తాతగారింట్లో నువ్వు పెంచిన పిచ్చుకలే అయివుంటాయి. నిన్ను

## అలాంటి అమ్మాయి కావాలి!

బ్రహ్మచారి అయిన సంగీతదర్శకుని బాధ ఇది. సందీప్ చౌతా (బాలీవుడ్‌లో 'చౌటా' అంటారు) రామ్‌గోపాల్‌వర్మ చిత్రాలకు సంగీతం సమకూర్చిన సంగతి అందరికీ తెలుసు. కానీ రొమాంటిక్ చిత్రాలకు చేయాలని వుంది అతనికి. చెన్నయ్ బీచ్ హౌస్‌లో రకరకాల పార్టీల్లో బోలెడు మందమ్మాయిలతో కలిసుంటాడని అంటారు. "నిజానికి ఇంత వరకూ నా జీవితంలోకి ఏ అమ్మాయీ రాలేదు. నేను సంగీతం గురించే మాట్లాడతాను. చాలా మందికి సంగీతమంటే బోర్. నా వేవ్ లెంగ్త్‌తో సగమైనా కలిసిన అమ్మాయి వేటలో వున్నానిప్పుడు. దొరుకుతుం దంటారా?" అనడుగుతున్నాడు సందీప్.

ఎన్.

వెతుక్కుంటూ ఇక్కడికి రావడానికి అన్నేళ్లు పట్టి వుంటుంది' అన్నాడు.


'పోనీ అలాగే అనుకోండి' అంది.

క్షణం ఆగి అన్నాడు. 'రేపటితో నీ శెలవు అయిపోతుంది. ఇంకా పొడిగిస్తావా?' ... లేదు రేపొక్కరోజు రెస్టు తీసుకుని ఎల్లుండి నుండి ఆఫీసుకెడతాను' అంది.

ఇంతలో పిచ్చుకలు బయటినుంచి వచ్చి మళ్లా గూట్లోకి వెళ్లిపోయాయి.

'అమ్మయ్య. అవి తిరిగొచ్చాయి!' అంది మాధవి ఆనందంగా.

'సరే! నువ్వు వాటిని చూస్తూ కూర్చో. నీకు



బ్రెడ్ పాలు తీసుకొస్తా' అంటూ శ్రీనివాస్ లోపలికెళ్లాడు.

***

మాధవి ఆఫీసుకెడుతోంది. సాయంత్రం ఆఫీసునుండి రాగానే పిచ్చుకల దగ్గర కాస్సేపు కూర్చునిగాని ఇంటిపనుల్లోకి వెళ్లడం లేదు. ఆఫీసు నుండి వచ్చేటప్పుడు బజార్లో ఆగి పిచ్చుకల కోసం రకరకాల ఆహారం తెస్తోంది. వాటికి స్వయంగా తనే తినిపిస్తోంది. గూడు ఇంకా పెద్దది తీసుకుంటాయోమోనని ఆకులు పుల్లలు ఏరి తెచ్చి బీరువా దగ్గర పెడుతోంది. ఇంట్లో ఎవ్వరూ ఆ బీరువా ఛాయలక్కూడా వెళ్లడానికి వీల్లేదని ఆజ్ఞాపించింది.

భార్య ప్రవర్తన చూసి 'ఏమిటో ఈ పిచ్చి!' అనుకున్నాడు శ్రీనివాస్.

***

ఒకరోజు మాధవి హఠాత్తుగా అంది... 'ఏవండీ! ఈ మధ్య పిచ్చుకలు కనబడ్డం లేదండీ!'

శ్రీనివాస్ ఉలిక్కిపడ్డట్టయి... 'ఆ ఎక్కడికో బయటకి వెళ్లి ఉంటాయిలే. అవే వస్తాయి!' అన్నాడు వెంటనే సర్దుకుని.

మాధవి ఆ విషయాన్నంత తేలిగ్గా తీసుకోలేదు. అది కాదండీ! ఇవ్వాళ్టికి నాలుగు రోజులైంది పక్షులు కనబడి. ఏమయిపోయాయో? గూట్లో పిల్లలున్న శబ్దం కూడా లేదు. మనింటికి ఎవరైనా వచ్చారా? లేక పనమ్మాయి వాటిని తరిమేసిందా? ఏం తెలీడం లేదు!' ఆందోళనగా అంది మాధవి.

'పిల్లలు పెద్దవయిపోయి ఎగిరిపోయి వుంటాయి. వాటితోపాటు పెద్ద పక్షులు వెళ్లిపోయి ఇంకెక్కడో గూడు పెట్టాయేమో!' అన్నాడు శ్రీనివాస్.

'లేదండీ! మా తాతగారింట్లో పిల్ల పక్షులు ఎగిరిపోయినా పెద్దవి మళ్లీ గ్రుడ్లు పెట్టేవి ఆ గూట్లోనే...'

'అబ్బా! అవి పల్లెటూరి పక్షులు! ఇవి పట్నం పక్షులు. అందులోనూ దేశ రాజధానిలో వున్నాయి! వీటికి తెలివితేటలెక్కువ. అవెక్కడో సుఖంగానే వుంటాయిలే. నువ్వు వాటిని గూర్చి మర్చిపో!' అన్నాడు.

'నేనా మర్చిపోలేనండీ! నాకు అవి కావాలి...' అంది మాధవి మొండిగా.

'డాడీ... మొన్న కుమారంకుల్ వచ్చినప్పుడు పిచ్చుకగూడు దగ్గరకెళ్లి ఏదో మాట్లాడాడు కదూ! ఏవన్నాడు?' అనడిగాడు చిన్న కొడుకు.

ఇంతలో హోంవర్కు చేస్తున్న పెద్దకొడుకు తలెత్తి 'అప్పుడు పిచ్చుకలు ఉన్నాయి కదా!... ఆ తర్వాత నుండే కనబడ్డం లేదు డాడీ!' అన్నాడు.

శ్రీనివాస్ పిల్లల మాటలకు కంగారుపడిపోయాడు. తన ఆదుర్దాని కప్పిపుచ్చుకుని... 'కుమార్ పిచ్చుకల్ని ఎప్పుడూ చూడలేదంటే తీసుకెళ్లి చూపించారా... అంతే' అన్నాడు నవ్వేస్తూ.

అది విని మాధవి ' మీ ఫ్రెండు కుమార్ వచ్చాడా? అయినా అతనికెందుకు చూపించారు. చెత్తలోంచి కూడా డబ్బేలా పుట్టించాలా అని ఆలోచిస్తాడు. అతనిది పూర్తిగా వ్యాపార మనస్తత్వం' అంది కోపంగా.

'అబ్బే! అతడేమనలేదు... చూసి వెంటనే వెళ్లిపోయాడు. అంతే అయినా ఎప్పుడూ వాటిగొడవేనా! కాస్సేపు నన్ను విసిగించకు. వార్తలు వింటున్నా!' అన్నాడు టి.వి. దగ్గరకు కుర్చీ జరుపుకున్నాడు.

భర్తవైపు అనుమానంగా చూసింది మాధవి. నాలుగురోజులనుండీ భర్త ప్రవర్తనలో ఏదో మార్పు కనబడుతోంది. పిచ్చుకల గురించి మాట్లాడినప్పుడల్లా మాట తప్పించడం ఏదో తప్పు చేసినట్లు చూడటం ... ఎందుకో అర్థం కాలేదామెకు.

శ్రీనివాస్ టి.వి.ని చూస్తున్నాడుగాని మనసులో వారంరోజుల క్రితం జరిగిన సంఘటనలు సుళ్లు తిరగసాగాయి.

ఒకరోజు ఆఫీసులో యథాలాపంగా తన ఫ్రెండు కుమార్‌తో తన ఇంట్లో ఉన్న పిచ్చుకల గూడు గురించి చెప్పాడు శ్రీనివాస్.

అతడు విస్తుబోతూ 'పిచ్చుకలా! అవెక్కడ ఉన్నాయిరా! మందుల తయారీకోసం పిచ్చుకలనన్నిటినీ చంపేస్తున్నారుగా. ఒక పిచ్చుక వేల ఖరీదు చేస్తుంది. నేను మీ ఇంటికొచ్చి వాటిని చూస్తానుండు' అన్నాడు.

శ్రీనివాస్ ఆశ్చర్యంగా 'పిచ్చుకలకి అంత ధరా?' అన్నాడు. 'అవునోయ్! నువ్వు చాలా అదృష్టవంతుడివిలే... నీకు ధనయోగం పట్టింది' అన్నాడు కుమార్.

'ధనయోగం' అనే మాట శ్రీనివాస్ మనసుపై మంత్రంలా పనిచేసింది. తీరని కోరికలెన్నో కళ్లముందు మెదిలాయి. అసలవెంత ఖరీదు చేస్తాయో తెలుసుకోవాలని ఆత్రుతగా వుంది.

'సాయంత్రం వరకూ ఎందుకు. ఒక పర్మిషన్ తీసుకుని ఇప్పుడే వెళదాం' అన్నాడు శ్రీనివాస్.

'ఓయస్,... పద' కుమార్ లేచాడు.

ఇద్దరూ ఆఫీసరు దగ్గర పర్మిషన్ తీసుకొని శ్రీనివాస్ స్కూటర్ మీద ఇంటికొచ్చారు. వాళ్లు వచ్చేసరికి పిచ్చుకలు ఇల్లంతా స్వేచ్ఛగా తిరుగుతున్నాయి. 'తలుపులు తీసున్నాయి కదా! హాయిగా విహరిస్తున్నాయి.' అన్నాడు శ్రీనివాస్.

కుమార్ వాటినే పరిశీలనగా చూస్తున్నాడు. 'వాసూ! ఇవి చాలామంచి జాతికి చెందినవి. మీ ఇంటికెలా వచ్చాయో! ఏదయినా నువ్వు చాలా అదృష్టవంతుడివి. వీటికి మంచి ధర వస్తుంది. పిచ్చుకల లేహ్యం ఎన్నో వ్యాధుల్ని తగ్గిస్తుంది. మగవాళ్లకి సెక్స్ సామర్థ్యాన్ని పెంచుతుందట కూడా!' నవ్వాడు కుమార్.

'అలాగా...'

'వీటిని నేను తీసుకెళ్లనా! బాగా డబ్బొస్తాలే' అన్నాడు కుమార్.

'ఎంతిస్తావేమిటి?'

చెప్పాడు....

ఆ ధర వింటూనే శ్రీనివాస్‌కి మైకం

కమ్మినట్లయింది. సంతోషంతో పొంగిపోయాడు. ఆ క్షణంలో శ్రీనివాస్‌కి ఆ అల్పప్రాణులపై మాధవి పెంచుకున్న మమకారం గుర్తుకు రాలేదు. కుమార్ ఇస్తానన్న డబ్బే కళ్లముందు మెదలసాగింది. డబ్బుపై ఆశ మనస్సుని మైకంలా కమ్మి విచక్షణా జ్ఞానాన్ని నశింపజేసింది.

'వాసు! నేను వీటిని పట్టుకెళ్లే ఏర్పాటులో వస్తా' అంటూ వెళ్లిపోయాడు కుమార్.

రెండ్రోజుల తర్వాత ఇద్దరు మనుషులతో వచ్చాడు. పని పూర్తిచేసుకుని వెళుతుంటే అప్పుడే స్కూలు నుండి వచ్చిన కొడుకులు అడిగారు.

'డాడీ! కుమారంకుల్ ఏమిటి పట్టుకు తీసుకెడుతున్నాడు?'

'అబ్బే! ఏం లేదురా! ఇంట్లో పనికిరాని వస్తువులుంటే ఇచ్చేసా,' అన్నాడు.

'అంటే ఆ బీరువాలో అమ్మ దాచినవా?'

'ఛ... ఛ... అవెందుకు తీస్తాను. నా గదిలో చిత్తు కాగితాలుంటే వెధవ ప్రశ్నలూ మీరూ... లోపలికి పోండి!' కసిరాడు.

వాటిని ఇవ్వడమైతే తేలిగ్గా ఇచ్చేసాడు కాని ఆ తర్వాతనుండి ఏదో తప్పు చేసినట్లు బాధపడసాగాడు శ్రీనివాస్. ఖాళీగూడు అతడ్ని నిలదీస్తున్నట్లనిపించేది.

కుమార్ వాటిని తీసుకెళ్లగానే గూడు తీసేద్దామనుకున్నాడు. కాని వెంటనే ఆ పని చేస్తే మాధవి అనుమానించి ఆవేదన పడుతుందని ఉంచేశాడు. మాధవి వాటి గురించి మర్చిపోయినప్పుడు గూడు తీద్దామనుకున్నాడు. కాని మాధవి ఇలా వాటినే గుర్తు చేసుకుంటుందని పిచ్చిదానిలా తయారవుతుందని ఎన్నడూ అనుకోలేదు.

'ఏవండీ! పిచ్చుకలు ఎక్కడికి ఎగిరిపోయివుంటాయి?' మాధవి మాటల్తో ఈ లోకంలోకి వచ్చాడు.

'అవి మళ్లా మీ దోసపాడు వెళ్లాయేమో' నవ్వేస్తూ అన్నాడు. మాధవి ఆ మాటలు విన్పించుకోలేదు. ఏదో లోకంలో ఉన్నట్లు 'ఏవండీ! ఆ గదిలో నుండి ధ్వనులేవో వినబడుతున్నాయి. మళ్లీ పిచ్చుకలు వచ్చాయేమో!' అంటూ మాధవి చటుక్కున లేచి గదిలోకి వెళ్లింది వెడుతున్న మాధవి వేపు జాలిగా చూసాడు.

అయ్యో! పిచ్చి మాధవీ! ఇంకా అవెక్కడున్నాయి! ఈ పాటికి మందుగామారి మార్కెట్లోకి వెళ్లుంటాయి. అనుకున్నాడు శ్రీనివాస్ బాధగా. పక్షులకోసం భార్యపడే ఆరాటం శ్రీనివాస్‌కి బాధతోపాటు భయాన్ని కూడా కలిగిస్తోంది. అవి ఇంట్లోంచి ఎగిరిపోయాయని చెప్పినా వాటికోసం ఎదురుచూస్తోంది. ప్రతీక్షణం వాటినే తలుచుకుంటూ బెంగ పెట్టుకుంటోంది. చివరికేమైపోతుందో?' అనుకున్నాడు.



మాధవి నిరాశగా తిరిగొచ్చి 'అబ్బే పిచ్చుకలు రాలేదండి అంతా నా భ్రమ!' అంది దిగులుగా.

భార్య ముఖంలోని బాధని విచారాన్ని గమనించి కుమార్‌కి వాటిని ఇవ్వకుండా ఉండాల్సింది. ఎంత పొరపాటు చేశాను అనుకుంటూ కుమిలిపోయాడు శ్రీనివాస్. కుమార్ వాటి ఖరీదిస్తే ఆ డబ్బుని ఏ అనాథ శరణాలయానికో ఇచ్చేసి పాప ప్రక్షాళనం కావించుకోవాలనుకుంటున్నాడు.

మర్నాడు కుమార్ లేహ్యం సీసా పంపించాడు కాని శ్రీనివాస్ దాన్ని తన చేత్తో తాకడానిక్కూడా భయపడి 'వద్దు... వద్దు... తీసుకెళ్లు' అన్నాడు కంగారుగా.

'లేదండి! కుమార్‌గారు మీకిచ్చిరమ్మన్నారు!' అంటూ బల్లమీద పెట్టేసి వెళ్లిపోయాడా కుర్రాడు.

ఇంతలో 'ఏమిటండీ అది' అంటూ లోపలి నుండి వచ్చింది మాధవి. మాధవి సీసాని చూస్తుందేమోనని దాన్ని తీసుకుని చటుక్కున అల్మారాలో పెట్టేశాడు... భార్య చూస్తే ఇంకేమైనా వుందా' అనుకున్నాడు.

'అబ్బే... ఏం లేదు. కుమార్ లివులెటర్ పంపాడులే అంటూ బాత్‌రూం వైపు నడిచాడు.

రెండ్రోజుల తర్వాత కుమార్ అడిగాడు.

'వాసూ! నేనిచ్చిన లేహ్యం చెల్లెమ్మ చేత తినిపిస్తున్నావా?' అమ్మాయికి కాళ్లునొప్పులన్నావుగా తగ్గుతాయి'.

'అబ్బే లేదు. పిచ్చుకల మీది పిచ్చి ప్రేమతో మాధవి మతిపోగొట్టుకునేట్టుంది. ఇప్పుడీ పరిస్థితిలో ఇదిచ్చానంటే ఆమెకు తప్పకుండా అనుమానమొస్తుంది. ఒకవేళ జరిగింది తెలిస్తే ఆమె ఏమవుతుందోనని భయంగా వుంది!' అన్నాడు శ్రీనివాస్ ఆందోళనగా.

అది విని ఆశ్చర్యబోతూ, 'ఛ! పిచ్చుకల మీద బెంగా! ఏదయినా చెల్లెమ్మ ఈ కాలం మనిషి కాదు. మనిషికి మరీ అంత సెంటిమెంట్లు పనికిరావు బ్రతకడం కష్టం', అన్నాడు కుమార్.

'ప్చ్! ఒక్కొక్కరి స్వభావం.. అది... మనమేం చెయ్యగలం...' నిర్లిప్తంగా అన్నాడు శ్రీనివాస్.

'ఆ స్వభావానుగుణంగా నడుచుకోకపోవడమే నేను చేసిన తప్పు' అనుకున్నాడు.

***

'అమ్మా! గదంతా ఆకులు చెత్త రాలుతున్నాయి. పిచ్చుకలు ఎగిరిపొయ్యాక ఇక ఆ ఖాళీ గూడెందుకు తీసేయ్యొచ్చుగా' అన్నాడొకరోజు పెద్ద కొడుకు.

కాని మాధవి ఒప్పుకోలేదు.

'ఆగూడునేమీ చేయొద్దు' ఆ పిచ్చుకలు ఎప్పటికైనా తిరిగొస్తాయి. వాటికి జ్ఞాపకశక్తి ఎక్కువ. అప్పుడా గూడు లేకపోతే అవెంత దిగులుపడతాయో తెలుసా! కష్టపడి కట్టుకున్నాయి కదా. అవి తప్పక వస్తాయి. వాటి గురించి నాకు బాగా తెలుసు.' అంది మాధవి.

సగం దిగులుగా సగం ఆశతో...

మాధవి మాటలు వింటూ శ్రీనివాస్ అల్మారాలో నున్న కుమార్ ఇచ్చిన సీసా వేపు చూశాడు. ఆ సీసానిక ఇంట్లో పెట్టుకోడానికి ధైర్యం చాల్లేదు. ఆ రాత్రి ఎవరూ చూడకుండా ఇంటి బయటనున్న మురుగు కాల్వలో పారేశాడు.

మాధవి ఇప్పటికీ ఆ పిచ్చుకలు తిరిగొస్తాయని ఎదురు చూస్తూనే వుంది. ■

## చక్కని కండలు పెంచాలా?

అరవై ఏళ్లలో కూడా కండలు వుండాలంటే తక్కువగా తినటమే మార్గం. ఎలుకలకు తక్కువ కాలరీలు, ఎక్కువ పోషకాలు వున్న ఆహారం పెట్టి, తక్కిన ఎలుకలతో పోలిస్తే, వాటి కన్నా, ఇవి సన్నగానూ, ఆరోగ్యవరంగా ఫిట్‌గానూ వున్నాయని తేలింది. తక్కువ తినటం వల్ల కాలరీలను శరీరంలోని వ్యవస్థ త్వరగా కరిగిస్తుంది. సమర్థంగా కండల మీద దాడి చేసే ఫ్రీ రాడికల్స్ నుంచీ కాపాడుతుంది. ఎంత తక్కువగా తింటే అంత బాగా సిస్టం పని చేస్తుంది. ఎక్కువ తినటం వల్ల ఆ పనాగిపోతుంది. అందువల్లే ఒక్కసారిగా పీకల్దాకా తినేసి ఆయాసపడటం కన్నా, కాస్త కాస్త చొప్పున ఐదారుసార్లు తినాలంటున్నారు.

ఎస్.